పిల్లలు సర్వతోముఖాభివృద్ధితో ఎదగాలి



పోచారం: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి విద్యతో పాటు శారీరక, మానసిక, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని ఐపీఎస్ అధికారి జోయల్ డేవిస్ అన్నారు. యంనంపేట్‌లోని రాక్‌ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం జరిగిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధి కోసం సహపాఠ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. క్రమశిక్షణ కలిగిన పిల్లలు నేటి ఆధునిక సమాజానికి ఎంతో అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలు, క్రీడా విన్యాసాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఇస్రో శాస్త్రవేత్త డా.వి.శేషగిరిరావు, ప్రొఫెసర్ షకీల్ అహ్మద్, విదుర లెర్నింగ్ సీఈఓ ఆదిత్యకుమార్, డా.బాల్‌రాజు నాయుడు, స్కూల్ చైర్మన్ రామానాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం శ్రీరంజని తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి ఆలయ వేదపండితులకు సన్మానం



ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీగోదా సమేత శ్రీమన్నారు రంగనాయక స్వామి ఆలయంలో శుక్రవారం గంగాలం (కుడారే) పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయంలో నిత్యం తిరుప్పావై వినిపించే ఆలయ వేద పండితులు లక్ష్మణాచార్యుల దంపతులను ఆలయ ముఖద్వారం దాత బట్టి లక్ష్మణ్ దంపతులు సన్మానించారు. ఆలయ ధర్మకర్తలు గోవిందాచార్యులు, శేషాచార్యులు, ఆదిత్యాచార్యులు పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పోలీసులకు చిక్కిన నిందితులు

పోచారం: వాహనాలు తనిఖీ చేస్తుండగా యంనంపేట్ చౌరస్తాలో 10 కిలోల గంజాయి పట్టుకున్నట్లు మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ చెప్పారు. నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్కాజిగిరి టాస్క్‌ఫోర్స్, ఘట్‌కేసర్ అబ్కారీ బృందాలు ఉమ్మడి తనిఖీలు నిర్వహిస్తుండగా ఘట్‌కేసర్ జంక్షన్ వద్ద అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కరీంనగర్‌కు చెందిన ప్రణీత్(24), కాకినాడకు చెందిన సతీష్(25), మధుకుమార్(22), పశ్చిమ గోదావరి జిల్లావాసి శివరాం (28), హన్మకొండకు చెందిన హేమంత్(21)గా గుర్తించామన్నారు. అరకు నుంచి గంజాయి తెచ్చి మేడిపల్లి, కీసర పరిసర ప్రాంతాల్లో కళాశాల విద్యార్థులకు అమ్ముతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. 10 కిలోల గంజాయితో పాటు కారు, టీవీఎస్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అబ్కారీ స్టేషన్ సీఐ మల్లయ్య, టాస్క్‌ఫోర్స్ సీఐ భరత్ భూషణ్, ఎస్‌ఐలు పురుషోత్తంరెడ్డి, ధన్‌రాజ్, శ్రావణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో ముగ్గుల పోటీలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మహిళా అధికారులు, ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పోటీలను డీఆర్‌ఓ హరిప్రియ ప్రారంభించారు. కలెక్టరేట్ ఏఓ రామ్మోహన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పశుసంవర్ధక కార్యాలయంలో శుక్రవారం ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రవి ప్రకాష్ అధ్యక్షతన తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం మేడ్చల్ యూనిట్ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శి మల్లేశం, కోశాధికారిగా ప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరిగా ప్రమీలాదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరిలుగా యాదగిరి, కసిరెడ్డి, ప్రచార కార్యదర్శిగా మల్లికార్జున్, సభ్యులుగా స్పందన, కల్పన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో అయోధ్య రామయ్య అక్షింతలకు శుక్రవారం ఘనస్వాగతం పలికారు. ఊరేగింపుగా వెళ్లి శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అయోధ్య రాములోరి అక్షింతలు, రామమందిర చిత్రపటం, కరపత్రం అందజేశారు. రఘు, లక్ష్మణ్, వెంకటరాజు, శ్రీరాములు, అరవింద్, రాజేశ్, పెంటాజీ, నాగేశ్, రాజు, రాము, చిత్తరంజన్, రాజు పాల్గొన్నారు.

నివాళి



మేడ్చల్: మేడ్చల్ మాజీ సర్పంచ్ దివంగత రాజేశ్వర్‌గౌడ్(చిలుక రాజు) జయంతి సందర్భంగా నాయకులు ఆయనకు నివాళులర్పించారు. చిలుకరాజు కుమారుడు, కౌన్సిలర్ మణికంఠ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో కౌన్సిలర్లు కాడె మహేశ్, శివకుమార్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ నాయకులు పాల్గొని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పోచారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు పోచారం సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న బండారి బాలరాజ్(46) ఈ నెల 6న కాలేజీ పనిమీద ఘట్‌కేసర్ వైపు వెళ్తున్నాడు. రాక్‌ఉడ్స్ స్కూల్ వద్దకు రాగానే వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తల నుంచి రక్తం కారడంతో వైద్యం కోసం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతడు శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అసైన్డ్ భూములకు రెక్కలు



కొండాపూర్‌లో మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్కారు భూమి

- ధరలు పెరగడంతో పెరిగిన కబ్జాల పర్వం
- కొండాపూర్‌లో జోరుగా నోటరీ విక్రయాలు
- రూ.30 కోట్ల సర్కారు భూమి అన్యాక్రాంతం
- అక్రమార్కులకు అధికారుల అండదండలు
- ఉన్నతాధికారులు స్పందించాలంటున్న జనం

ఘట్‌కేసర్: భూముల ధరలు పెరగడంతో అక్రమార్కులు కబ్జాలకు పాల్పడటంతో పాటు వక్ర మార్గాలను అన్వేషిస్తున్నారు. ఎకరా భూమి ధర రూ.లక్షల నుంచి ప్రస్తుతం రూ.కోట్లకు చేరుకుంది. ఒకప్పుడు నగరానికే పరిమితమైన భూముల ధరలు ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలనూ వదలడం లేదు. పట్టా భూములకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో అక్రమార్కుల కన్ను ప్రస్తుతం సర్కారు భూములపై పడింది. పేద, మధ్యతరగతి ప్రజలు 100 గజాల ప్లాటు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొనడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. పట్టా భూముల్లో ప్లాటు కొనలేని స్థితిలో ఉన్న పేదలు తక్కువ ధరలకు లభించే ప్రభుత్వ భూముల్లో కొనుగోలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధమైనా పట్టించుకోకుండా క్రయవిక్రయాలు చేస్తున్నారు. అక్రమార్కులు ధరలను ఆశగా చూపి పేదలకు అంటగడుతున్నారు. ఎప్పటికైనా తమ పేరుపై మారుతాయన్న భావనతో తక్కువ ధరకు వస్తోందనే ఆశతో వాటిని కొనుగోలు చేసి కష్టాలు తెచ్చుకుంటున్నారు. దీంతో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. పట్టా భూమిని కొనుగోలు చేస్తున్న అక్రమార్కులు పక్కనున్న ప్రభుత్వ భూమికి కూడా ఎసరు పెడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

రూ.30 కోట్ల భూమికి ఎసరు..

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్‌లో ఘట్‌కేసర్–కీసర మెయిన్ రోడ్డును ఆనుకొని సర్వే నంబర్ 289లో 7.15 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఎకరం భూమి సుమారు రూ.4–5 కోట్లు పలుకుతుండగా మొత్తం విలువ రూ.30 కోట్లకు పైనే ఉంది. రాజకీయ నాయకుల అండతో నోటరీ ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఇళ్లు నిర్మించుకోగానే కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో అధికారులు మిన్నకుండిపోతున్నారు.



కొండాపూర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)

బలవుతున్న పేదలు..

కొండాపూర్ మెయిన్ రోడ్డుకు ఆనుకొని సర్వే నంబర్ 289లో 7.15 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. గతంలో 2 ఎకరాలు ఒకరికి, 5 ఎకరాల భూమిని మరొకరికి ప్రభుత్వం పంపిణీ చేయగా మిగిలిన 15 గుంటల భూమి రోడ్డులో పోయింది. ప్రభుత్వం ఇచ్చిన భూమిలో సాగు చేసుకోవడం తప్ప క్రయవిక్రయాలకు హక్కులేదు. ఎవరైనా అమ్మినా, కొనుగోలు చేసినా చెల్లదు. గతంలో భూమి చదును చేసే సమయంలో రెవెన్యూ అధికారులు పనులు ఆపినా, మొన్న జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో అధికారులు బిజీగా ఉండటంతో అక్రమార్కులు నిర్మాణాలు చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ఇక్కడ ఆర్టీసీ డిపో నిర్మించాలని శంకుస్థాపన చేశారు. అనంతరం గద్దెనెక్కిన ప్రభుత్వం గాలి కొదిలేయడంతో అక్రమార్కులకు వరమైంది.

ప్రజావసరాలకు వినియోగించకుండా..

కొండాపూర్ సబ్‌స్టేషన్ వెనకాల నిర్మిస్తున్న బాలికల ఐటీఐ, మినీ స్టేడియం, వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌కు కేటాయిస్తే బాగుండేదన్న అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని వదిలిపెట్టి రవాణా సౌకర్యం లేని లోపలి ప్రాంతంలో ప్రజల అవసరాలకు కేటాయిస్తుండటం అనుమానాలకు దారి తీస్తోంది.

నోటీసులు ఇచ్చాం..



ప్రభుత్వం ఇచ్చిన భూమిలో ప్లాట్ల విక్రయంపై గతంలో సర్కారు భూమిని పొందిన వారికి నోటీసులు అందజేశాం. వారి సంజాయిషీని అధికారులకు అందజేస్తాం. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం.

– సందీప్‌కుమార్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్, ఘట్‌కేసర్

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ దయానో ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ఏఈ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దయానో ఫీడర్, కేఎల్లార్ నగర్, 11కేవీ యంనంపేట్ ఫీడర్‌కు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పాలియేటివ్ కేర్ సేవలు అవసరం



పాలియేటివ్ కేర్ సెంటర్‌ను సందర్శిస్తున్న జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి

శామీర్‌పేట్: ప్రస్తుత సమయంలో పాలియేటివ్ కేర్ సేవలకు ప్రాధాన్యం సంతరించుకుందని మేడ్చల్ జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లోని ఛాయ్ సంస్థలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పాలియేటీవ్ కేర్ సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాలియేటివ్ కేర్ సెంటర్ సేవలను గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడం అవసరమని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా వైద్య కేంద్రాలకు అనుబంధంగా పాలియేటివ్ కేర్ సేవలు అందిస్తున్నామని ఆయన వివరించారు.

యువజనోత్సాహం

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

మందలో ఒకడిగా ఉండకు.. వందలో ఒకడిగా ఉండటానికి ప్రయత్నించు! కెరటం నాకు ఆదర్శం.. లేచి పడుతున్నందుకు కాదు.. పడినా లేస్తున్నందుకు..! లేవండి.. మేల్కొండి.. మీ గమ్యం చేరే వరకు విశ్రమించకండి.. నిరాశ నిస్పృహలో ఉండే వారు స్వామి వివేకానందుడి సూక్తులు చదివితే.. అనుకున్నది సాధించాలనే ఆశను రేకెత్తిస్తాయి. యువత ఈ దేశానికి ఎంతో అవసరం అంటూ స్వామి వివేకానంద చేసిన ప్రసంగాలు ఎందరికో స్ఫూర్తినింపాయి. అందుకే భారత ప్రభుత్వం స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించింది. శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో స్వామి వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– మేడ్చల్ జోన్ బృందం



కేశ్వాపూర్ చౌరస్తాలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



ఎన్ఆర్ఈసీ కళాశాలలో యువజన దినోత్సవం



గిర్మాపూర్‌లో వివేకానంద జయంతిలో నాయకులు



మైసమ్మగూడలో కౌన్సిలర్లు పెంటయ్య, మల్లికార్జున్ ముదిరాజ్



చీర్యాల చౌరస్తాలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు



నాగారంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు



చందుపట్లగూడలో చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో స్వామి వివేకానంద యూత్ సభ్యుల వేడుకలు



మేడ్చల్‌లో వివేకానంద జయంతిలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

విద్యార్థులకు సభ్యత, సంస్కారం అవసరం

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తదితరులు

పోచారం: విద్యార్థులు వంద శాతం మార్కులు సాధించడం ఎంత ముఖ్యమో సమాజం పట్ల బాధ్యతగా ఎదగడం అంతే అవసరమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. అన్నోజిగూడలోని శ్రీవిద్యా విహార్ స్కూల్ ఆవరణలో శుక్రవారం జరిగిన క్రీడా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంత పెద్ద కార్పొరేట్ స్కూల్‌లో చదివినా, అనర్గళంగా ఆంగ్ల భాష మాట్లాడగలిగినా సభ్యత, సంస్కారాలు లేకపోతే రాణించడం కష్టసాధ్యమన్నారు. మంచి వైఖరులతో పది మందిలో ప్రత్యేకత చాటుకున్న పిల్లలే రేపటి తరంలో కీలక భూమిక పోషిస్తారన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అఖిల భారత ధర్మజాగరణ సహసంయోజక్ ఆలె శ్యాంకుమార్, ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్ర ప్రచారక్ భాస్కర్, ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, రాష్ట్రీయ విద్యా కేంద్ర అధ్యక్షుడు సుందర్‌రెడ్డి, కోశాధికారి ఓంప్రకాష్ శర్మ, జాయింట్ సెక్రటరీ బి.మహేష్ కుమార్, గౌరవాధ్యక్షుడు డా.విష్ణువర్ధన్‌రెడ్డి, స్కూల్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ హనుమంతరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కూళ్లలో సంక్రాంతి వేడుకలు

అన్ని ప్రాంతాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. పండగ జరుపుకునేందుకు ఇప్పటికే సొంత ప్రాంతాలకు వెళ్లారు. శుక్రవారం అన్ని ప్రాంతాల్లోని స్కూళ్లలో సంక్రాంతి సంబురాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు సంక్రాంతి పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.



నాగారం సెరినిటీ పాఠశాలలో సంక్రాంతి సంబురాలు



గుండ్లపోచంపల్లి సెయింట్ ఆగ్నెస్ పాఠశాలలో..



నాగారం వెస్ట్‌గాంధీనగర్‌కాలనీలో బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



మునీరాబాద్‌లోని ఎస్‌కేఎమ్ పాఠశాలలో..



నాగారం సెరినిటీ స్కూల్ ఆవరణలో పెద్దఎత్తున ముగ్గులు వేస్తూ..



మేడ్చల్ పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థులు



సెయింట్ పీటర్స్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు



మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాలలో..